1St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN


సంపుటి : 2 సంచిక : 314 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 10 నవంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 314 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 10 November 2025 PAGES : 8 PRICE : 3/-

# ఆరోగ్యం లేకుంటే ఎన్ని ఆస్తులున్నా నిరుపయోగమే

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

ప్రపంచంలో ఆరోగ్యానికి సంబంధించిన నాలెడ్జ్ ఎక్కడ ఉన్నా .. రోగి ఇంటి వద్దే వైద్యం అందించేలా 'సంజీవని ప్రాజెక్టు' పనిచేయబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో శంకర ఐ ఆసుపత్రి భవనాన్ని సీఎం ప్రారంభించారు. "రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది హెల్త్ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి.. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. రాబోయే రోజుల్లో.. ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఏపీ ఒక రోల్ మోడల్‌గా ఉంటుంది. సంపద, బంగ్లాలు, కార్లు, హోదా ఎన్ని ఉన్నా.. మంచి ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. అనారోగ్యమే నిజమైన పేదరికం. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు శంకర్ ఐ ఆసుపత్రి చేస్తున్న కృషిని అభినందిస్తున్నా. శంకర ఐ ఫౌండేషన్ సేవలు బాగున్నాయి. నేపాల్, కాంబోడియా, నైజీరియాలోనూ శంకర ఐ ఆసుపత్రులు ఉన్నాయి. కంచి పీఠం పిలుపునిస్తే అనేకమంది దాతలు స్పందిస్తారు. రెయిన్‌బో కార్యక్రమం ద్వారా పిల్లల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు 32వేల వైద్య శిబిరాలు నిర్వహించి.. దాదాపు 30లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు చేశారు. రోజుకు 750 మందికి కంటి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. శంకర ఐ ఆసుపత్రిని ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నా. హిందూ ధర్మ పరిరక్షణకు కంచి మఠం అనేక కార్యక్రమాలు చేస్తోంది. పూరి, శృంగేరిలో పీఠాలు స్థాపించి హిందూ ధర్మాన్ని రక్షిస్తున్నారు" అని సీఎం అన్నారు.






## సీఐఐ భాగస్వామ్య సదస్సుతో ఉత్తరాంధ్ర జిల్లాలకు గుర్తింపు: మంత్రి సంధ్యారాణి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

సీఐఐ భాగస్వామ్య సదస్సు ఉత్తరాంధ్ర జిల్లాలకు గుర్తింపు తీసుకురానుందని మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజన గ్రామాలంటే ఒకప్పుడు డోలీ మోతలే కనపడేవని.. కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు ఆ ప్రాంతాలు పర్యాటక అనుభూతిని అందిస్తున్నాయని చెప్పారు. -మిగతా 2లో



## మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

మహిళలు స్వశక్తితో ఎదిగి అన్ని రంగాల్లో ధైర్యంగా ముందడుగు వేయాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన 'స్త్రీ శక్తి హస్తకళ స్టోర్'ను శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. -మిగతా 2లో



## బిహార్‌లో మరోసారి ఎన్డీయేదే అధికారం: మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పట్నాలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బిహార్‌లో భాజపా ఎన్నికల ప్రచార సమన్వయకర్తగా ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహరిస్తున్నారు. కూటమి విజయం కోసం ఆయన శ్రమిస్తున్నారని, గతేడాది హరియాణా, ఒడిశా ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా లోకేశ్ మీడియాతో అన్నారు. బిహార్‌లో మరోసారి ఎన్డీయే సర్కారును గెలిపించేందుకు ధర్మేంద్ర ప్రధాన్ చేస్తున్న కృషిని మంత్రి లోకేశ్ అభినందించారు. -మిగతా 2లో

## తెదేపాతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీకి బీసీలు అండగా నిలిచారని.. ఆయా వర్గాలను బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తెదేపాతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. శనివారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో భక్త కనకదాస జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో నూతనంగా ఏర్పాటుచేసిన కనకదాస విగ్రహాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించి మాట్లాడారు. "కనకదాస జయంతిని అధికారికంగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో కురుబ సోదరులు కోరారు. ఆరోజు ఇచ్చిన హామీ ఈరోజు నెరవేర్చాం. 2019-24 మధ్యలో మన బిడ్డలపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. బీసీ సోదరుల్లో తిరుగుబాటు వచ్చి 94% సీట్లతో కూటమిని గెలిపించారు. పాదయాత్ర చేసినప్పుడు బీసీల్లోని ఉపకులాలను కలిసి సమస్యలు తెలుసుకున్నా. వాటిని పరిష్కరించేవరకు నిద్రపోను. ఫైర్‌బ్రాండ్ మంత్రి సవితమ్మ మీకు ఉన్నారు. ఎంపీ బీకే పార్థసారథి కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొస్తున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన పథకాలతో కురుబలను అనుసంధానం చేసి ముందుకు తీసుకెళతాం. బీరప్ప పేరుతో తితిదే సహకారంతో గుడులు నిర్మిస్తాం. గుడికట్ల పూజారులకు త్వరలోనే గౌరవవేతనం అందిస్తాం. అసంపూర్తిగా నిలిచిపోయిన కురుబ భవనాలను 12 నెలల్లో పూర్తిచేస్తాం. బీమా, షెడ్లు నిర్మించి ఇచ్చేలా పవనన్నతో మాట్లాడతా. కురుబల ఆలయాల్లో పూజాదికాల కోసం ఆర్థికసాయం అందిస్తాం" అని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

## న్యాయ పరిభాషను సరళీకరించాలి

సులభంగా న్యాయం అందేందుకు అది దోహదం చేస్తుంది

తీర్పుల అనువాదంలో సుప్రీంకోర్టును హైకోర్టులు అనుసరించాలి

జాతీయ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 09)

'లీగల్ ఎయిడ్ డెలివరీ మెకానిజం'పై జరిగిన సదస్సులో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, ప్రధాని మోదీ మాటామంతీ దిల్లీ: న్యాయ పరిభాషను సరళీకరించడం ద్వారా చట్టం అందరికీ అవలీలగా అర్థమయ్యేలా చూడాలని, సామాజిక ఆర్థిక నేపథ్యంతో ప్రమేయం లేకుండా ప్రతి పౌరునికీ తేలికగా న్యాయం అందేందుకు ఇది దోహద పడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు. న్యాయశాస్త్ర గ్రంథాల్లోని భాషను సరళీకరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. న్యాయ సహాయం అందజేత వ్యవస్థల బలోపేతంపై శనివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన -మిగతా 2లో



## పోలవరం లింక్ ప్రాజెక్ట్ భారీ అవినీతికి స్కెచ్ ప్రభుత్వంపై వైఎస్ షర్మిల తీవ్ర ఆరోపణలు

పోలవరం లింక్ ప్రాజెక్ట్ భారీ అవినీతికి వేసిన ఎత్తుగడ అన్న షర్మిల

పోలవరం పూర్తిపై కాకుండా అనుసంధానంపైనే ప్రభుత్వ శ్రద్ధ అని ఆరోపణ

పోలవరం ఎత్తు తగ్గించి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టారని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం భారీ అవినీతికి వేసిన పథకమని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇదొక ఏటీఎంలా పనిచేస్తుందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆమె 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు."నిన్న బనకచర్ల, నేడు నల్లమల సాగర్.. పోలవరం లింక్ ప్రాజెక్టుకు అనుమతులు రాకున్నా చంద్రబాబు గారి ఆశ మాత్రం చావలేదు. ప్రాజెక్టుల అనుసంధానంపై ఉన్న శ్రద్ధ.. పోలవరం పూర్తి చేయడంపై లేదు," -మిగతా 2లో



## కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

చిత్తూరు జిల్లాలో కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. పలమనేరు మండలం ముసలిమడుగులో 20 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి 4 కుంకీ ఏనుగులను తెచ్చినట్లు పవన్ కల్యాణ్‌కు అధికారులు తెలిపారు. వీటి ద్వారా జనావాసాలు, పొలాల్లోకి వచ్చే అడవి ఏనుగులను ఎలా కట్టడి చేస్తారో వివరించారు. కుంకీ ఏనుగుల విన్యాసాలను పవన్ కల్యాణ్ తిలకించారు. వాటికి ఆహారం తినిపించారు.

## ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు మోహన్ భగవత్



ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమన్న మోహన్ భగవత్

రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లమని వెల్లడి

కాషాయం మాకు గురువు లాంటిది,

అందుకే ఆ జెండాను ఎగరేస్తాం అని వివరణ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 09)

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది -మిగతా 2లో

## పునశ్చరణ తరగతులతో సిబ్బంది నైపుణ్యం పెంచండి

ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలు చేపట్టాలి..

వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు కేంద్ర బృందం సూచన

వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్‌తో చర్చిస్తున్న కామన్ రివ్యూ మిషన్ ప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 09)

రాష్ట్రంలో వైద్య సేవలతోపాటు మాతా శిశు సంరక్షణ చర్యలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్యశాఖకు కేంద్ర బృందం పలు సూచనలు చేసింది. ఈ నెల 4 నుంచి పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో పర్యటించిన కామన్ రివ్యూ మిషన్ (సీఆర్‌ఎం) బృందాలు మంగళగిరిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ సంచాలకులు చక్రధరబాబు, జాతీయ ఆరోగ్య మిషన్ -మిగతా 2లో

# రైతులకు నష్ట పరిహారం త్వరగా అందే విధంగా చూడాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 9)

ఈ నెల 10,11 తేదీల్లో ఏపీలో కేంద్ర హెూం శాఖ ఉమ్మడి సెక్రటరీ బసు నేతృత్వంలో ఏడుగురు సభ్యుల బృందం తుఫాను ప్రభావిత జిల్లాల్లో పర్యటిస్తున్న సందర్భంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ తరపున తుఫాను ప్రభావిత జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందాలకు డిమాండ్ తెలిపారు. ప్రకాశం జిల్లాలోని మార్కాపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలలో ఉన్నటువంటి మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలలో తుఫాను వల్ల రైతులు సాగు చేసిన పత్తి, కంది, బొబ్బర్లు, సజ్జ, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినదని సిపిఐ పొదిలి మండల సెక్రటరీ కె. వెంకటరత్నం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రకాశం జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందం మార్కాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కూడా పర్యటించి పంట నష్టం ఎంత వాటిల్లింది అనే విషయాన్ని అటు కేంద్ర ప్రభుత్వాలకు ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దిష్టమైన నివేదిక అందించి మార్కాపురం నియోజకవర్గ రైతులకు నష్ట పరిహారం త్వరగా అందే విధంగా చూడాలని సి.పి.ఐ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

# చరిత్ర పునరుద్ధరణ ద్వారానే మన చరిత్ర వెలుగులోకి వస్తుంది

## డాక్టర్ ఎం ప్రసన్నకుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)

పాండిచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ వారు హైదరాబాదులోనే వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో భాష వాతావరణం మారుతున్న వాతావరణము సమాజంలో మానవ జీవితాలు అన్న ప్రధాన అంశంపై సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ప్రకాశం జిల్లా నుండి డాక్టర్ ఎం ప్రసన్నకుమార్ పాల్గొని అంబేద్కర్ రచించినటువంటి నీటి న్యాయం, పరిరక్షణ సమానత్వానికి మార్గము అనే అంశం మీద ప్రసంగించడం జరిగింది. కావేరీ జలాల సమస్య నేపథ్యంలో ప్రారంభించిన అంశాలే ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడినటువంటి నాగార్జునసాగర్ వద్ద కూడా ఇప్పటికి గుర్తులు ఉన్నాయని పేర్కొనడం జరిగింది. దేశంలోనే వివిధ రాష్ట్రాల నుండి మొత్తం 124 మంది పేపర్ ప్రజెంటేషన్ చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని పుదుచ్చేరి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ డి సందీప్ నిర్వహించడం జరిగింది. వారు మన ఆంధ్రప్రదేశ్ కి చెందినటువంటి వ్యక్తి కావడం ఎంతో గర్వకారణమన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### సీఐఐ భాగస్వామ్య సదస్సుతో ఉత్తరాంధ్ర జిల్లాలకు గుర్తింపు: మంత్రి సంధ్యారాణి

పెట్టుబడుల సదస్సుకు వచ్చేవారికి ఉత్తరాంధ్ర పర్యాటక అనుభూతి కలుగుతుందన్నారు. 96 గిరిజన గ్రామాలకు రోడ్ల కోసం ఇప్పటికే రూ.28 కోట్లు మంజూరయ్యాయన్నారు. అరకు, పాడేరు పరిధి గ్రామాల్లో రోడ్లపై ప్రతిపాదనలకు ఆదేశించినట్లు మంత్రి చెప్పారు.

### మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుప్పం ప్రాంతానికి చెందిన మహిళలు ఎన్టీఆర్ ట్రస్ట్ చేయూతతో సిల్క్ థ్రెడ్ బ్యాంగిల్స్, జూట్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ పొందారు. వారు తయారుచేసిన వస్తువులను ఈ స్టోర్ ద్వారా కొనుగోలుదారులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ..ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.

### బిహార్‌లో మరోసారి ఎన్డీయేదే అధికారం: మంత్రి లోకేశ్

రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేయగలదన్న నమ్మకం తనకుందని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ వెంట ఎంపీలు సానా సతీష్, గంటి హరీష్, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

### పోలవరం లింక్ ప్రాజెక్ట్ భారీ అవినీతికి స్కెచ్ ప్రభుత్వంపై వైఎస్ షర్మిల తీవ్ర ఆరోపణలు

అని షర్మిల తన పోస్టులో పేర్కొన్నారు. నిపుణులు వద్దంటున్నా డీపీఆర్‌ల పేరుతో హడావుడి చేయడం వెనుక ఆంతర్యమేమిటని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలవరంతో పాటు 56 సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండగా, వాటిని గాలికొదిలేసి లింక్ ప్రాజెక్టును పట్టుకుని తిరుగుతున్నారని ఆరోపించారు.పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించి జీవనాడిలో జీవం తీశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్ల పునరావాస ప్యాకేజీని మిగుల్చుకోవడం కోసమే ఈ అన్యాయం చేసిందని, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నా కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న చంద్రబాబు నోరు మెదపడం లేదని విమర్శించారు. పోలవరం, ఇతర జలయజ్ఞం ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికి సవతి తల్లి ప్రేమ ఉందని ఆమె వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 56 జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సుమారు రూ.60 వేల కోట్లు అవసరమని, వాటిని పూర్తి చేస్తే 54 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని షర్మిల వివరించారు. లింక్ ప్రాజెక్టుకు పెట్టే నిధులతో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చుని, కానీ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదని అన్నారు. దీన్ని బట్టే సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందని ఆమె ఎద్దేవా చేశారు.

### న్యాయ పరిభాషను సరళీకరించాలి

జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) 30వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో.. సామాజిక మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించారు. అందరికీ న్యాయం అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న న్యాయ సహాయం.. పేదలకు తేలికగా న్యాయం అందేందుకు దోహదపడుతోందని చెప్పారు. సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి పౌరునికీ న్యాయం అందితే సామాజిక న్యాయం అందరికీ అందినట్లేనని పేర్కొన్నారు.

**తీర్పులు స్థానిక భాషల్లో అందించాలి**

కోర్టు తీర్పుల్ని, ఇతర న్యాయసంబంధ పత్రాలను స్థానిక భాషల్లో అందించాల్సిన అవసరాన్ని ప్రధాని నొక్కి చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు చూపుతున్న చొరవను అభినందించారు. సుప్రీంకోర్టు 80 వేలకు పైగా తీర్పుల్ని 18 భారతీయ భాషల్లోకి అనువదించేందుకు చూపిన చొరవ శ్లాఘనీయమని అన్నారు. హైకోర్టులు, జిల్లా న్యాయస్థానాలు కూడా ఇలాంటి చొరవ చూపుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.కాలదోషం పట్టిన 1,500కి పైగా చట్టాలను గత 11 ఏళ్లలో రద్దుచేశామని, 3,400 నిబంధనల్ని నేరరహితం చేశామని గుర్తుచేశారు. చాలాఏళ్లుగా ఉన్న చట్టాల స్థానంలో భారతీయ న్యాయసంహితను తీసుకువచ్చామని చెప్పారు. మధ్యవర్తిత్వం ఎప్పటినుంచో మన నాగరికతలో ఉందని, దానిని ఆధునిక రూపంలో ముందుకు తీసుకువెళ్లేందుకు కొత్తచట్టం దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

**న్యాయం పొందడం అందరి హక్కు: సీజేఐ**

సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ– న్యాయం ఏ కొందరికో పరిమితమయ్యే ప్రత్యేక గౌరవం కాదని, ఇది ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు. న్యాయం ప్రసరించే వెలుగులు చివరి వ్యక్తి వరకూ చేరేలా చూడటం న్యాయవాదులు, న్యాయమూర్తుల ధర్మమని చెప్పారు. కార్యక్రమానికి ప్రధాని హాజరు కావడం శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల సమష్టి బాధ్యతను సూచిస్తోందని అన్నారు. సంక్లిష్టమైన వ్యాజ్యాలను ఎంత అవలీలగా పరిష్కరించారన్న దానిపై న్యాయవ్యవస్థ సామర్థ్యం ఆధారపడదని, ప్రజల జీవితాలపై ప్రభావం చూపడమే సామర్థ్యానికి గీటురాయి అని.. కాబోయే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. ఉచిత న్యాయసేవ అందించాలని నిర్దేశించడం ద్వారా మన రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టిని చాటారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ అన్నారు.

### ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు మోహన్ భగవత్

ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ, "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు. "ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చిచెప్పారు."మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము 'రాష్ట్ర నీతి'కి మద్దతిస్తాం, 'రాజనీతి'కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పనిచేసినా వారికి మా మద్దతు ఉంటుంది" అని భగవత్ పేర్కొన్నారు.

**జెండా వివాదంపై స్పష్టత**

జాతీయ జెండాకు బదులుగా ఆర్ఎస్ఎస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. "సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందూత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం" అని తెలిపారు. జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. "ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు" అని స్పష్టం చేశారు.

మీడియా విమర్శలపై స్పందిస్తూ, "ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం" అని మోహన్ భగవత్ అన్నారు.

### పునశ్చరణ తరగతులతో సిబ్బంది నైపుణ్యం పెంచండి

అధికారులతో శనివారం సమావేశమయ్యాయి. కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జోయ అలీ రిజ్వీ, ఉప కార్యదర్శి డాక్టర్ భవానీ సింగ్ నేతృత్వంలోని బృందాల సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

# బ్రాహ్మణుల అభివృద్ధికి తన సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తాం

## ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)

బ్రాహ్మణుల అభివృద్ధికి తన సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. ప్రకాశం జిల్లా వైఖానస సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్రాహ్మణులలో ఇళ్ల స్థలం లేని వారి వివరాలు తనకు తెలియజేస్తే అందరికీ ఒకచోట ఇంటి స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణులకు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని వారి అభ్యున్నతికి తన శక్తివంచ లేకుండా కృషి చేస్తానని అన్నారు. బైపాస్ రోడ్ లోని వైఖానస ఆశ్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం అందజేసి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే దామచర్ల ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వైఖానస ఆశ్రమ నిర్వహణలో నగరపాలక సంస్థ తరపున తన సంపూర్ణ సహకారాలు అందిస్తానన్నారు. వైఖానస ఆశ్రమం ప్రాంతాన్ని వైఖానస నగరగా ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్లో తీర్మానాన్ని ప్రవేశపెడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఖానస సంఘం అధ్యక్షులు పరంకుశం కేశవాచార్యులు, ప్రధాన కార్యదర్శి ఆత్రేయ, గౌరవాధ్యక్షులు డాక్టర్ గంజాం శ్రీనివాసమూర్తి, ఆయుర్వేద డాక్టర్ హరిబాబు, అడ్వకేట్ శేషాచార్యులు, త్రినాధాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.





షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వం ధ్యేయం

రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే
కూటమి ప్రభుత్వం ధ్యేయం
రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు దేశ, విదేశాలు తిరుగుతున్న సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్
విశాఖ పెట్టుబడుల సదస్సు ద్వారా 7.2 లక్షల ఉద్యోగాలు
వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు శుభపరిణామం
వైసీపీ హయాంలో ప్రకాశం జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యం
జిల్లా అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కి
జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు
మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
11న జరగనున్న ముఖ్యమంత్రి కనిగిరి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 9)
రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో ఈనెల 11న జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఆదివారం నాడు మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై మంత్రి అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కులు, బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 11న పీసీ పల్లితో పాటు రాష్ట్రంలో మరి కొన్ని ఎంఎస్ఎంఈ పార్కులు పర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. నిరుద్యోగ రహిత ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కాలికి బలపం కట్టుకొని దేశ విదేశాల్లో పర్యటిస్తున్నారన్నారు. లోకేశ్ దీపావళి పండుగ నాడు కూడా కుటుంబ సభ్యులతో గడపకుండా పెట్టుబడుల కోసం విదేశాల్లో తిరుగుతూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. విశాఖలో పెట్టుబడుల సదస్సు ద్వారా 7.2 లక్షల ఉద్యోగుల కల్పన దిశగా ఎంఓయూలు కుదుర్చుకోనున్నాం. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి మార్కాపురం కేంద్రంగా జిల్లా, త్వరితగతిన వెలుగొండ పూర్తికి ప్రత్యేక ప్రణాళికలతో జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి లోకేష్ కి జిల్లా ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

---

## చీమకుర్తి హరిహర క్షేత్రంలో అంగరంగ వైభవంగా

# శ్రీ అయ్యప్పస్వామి కలశ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం



దీక్షా స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన
మాజీమంత్రి శిద్దా రాఘవరావు,
శిద్దా పాండురంగారావు, శిద్దా సుధాకర్ దంపతులు
పెద్ద సంఖ్యలో పాల్గొన్న సర్వ దీక్షా స్వాములు, భక్తులు
అయ్యప్ప స్వామి శరణు ఘోషతో
శబరిమల సన్నిదానం తలపించిన శ్రీ హరిహర క్షేత్రం

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, నవంబర్ 9)
శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం చీమకుర్తి హరిహర క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా చీమకుర్తి హరిహర క్షేత్రంలో నిర్వహించే కలశ ప్రాణ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా



# నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోదకుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 9)
ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్, మండల తహశీల్దార్ల కార్యాలయాలలోను తహశీల్దార్లు, ఎంపిడిఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. మీకోసం.ఏపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# కందుకూరు అతిత్వరలో ప్రకాశం జిల్లాలోకి అందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు



వైసిపి తప్పులను మేము సరిదిద్దుతున్నాం
రూ.8 కోట్లతో కందుకూరులో కొత్తగా అభివృద్ధి పనులు
విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 9)
గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారమే కందుకూరు నియోజకవర్గం అతిత్వరలో ప్రకాశం జిల్లాలో కలవబోతుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ ప్రజలను గత వైసిపి ప్రభుత్వం నిలువునా మోసం చేసి, లక్షల మంది అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రకాశం జిల్లా నుంచి విడదీసి నెల్లూరులో కలిపారని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరి చేసుకుంటూ వస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించిన సబ్ కమిటీ, ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నట్లుగా కందుకూరు నియోజక వర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేందుకు నిర్ణయించిందని ఎమ్మెల్యే తెలిపారు. అతి త్వరలోనే ఆ కల నిజం కాబోతోందని చెప్పారు. సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యను డిఆర్‌సి సమావేశంలో ప్రస్తావించానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. 1983 ప్రాంతంలో అక్కడి అటవీ భూముల్లో మత్స్యకారులకు కాలనీలు నిర్మించారని అన్నారు. ఇప్పుడు

## పోలీసుల క్రమశిక్షణ, ఆరోగ్యానికి యోగాసనాలు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 9)

పోలీసు శాఖలో క్రమశిక్షణతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఈరోజు మాచర్ల అర్బన్ సీఐ టి వెంకటరమణ ఆధ్వర్యంలో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనంతకృష్ణ, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం సమయానికే పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో యోగా గురువుల మార్గదర్శకత్వంలో పలు యోగాసనాలు చేశారు. పోలీసు సిబ్బంది రోజు వారి ఒత్తిడిని తగ్గించడంలో మనసు ప్రశాంతంగా ఉంచడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని సీఐ వెంకటరమణ తెలిపారు. ప్రతి రోజు కొద్ది సమయం కేటాయించి యోగాసనాలు చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెరుగుతాయని సూచించారు. ఈ కార్యక్రమం పోలీసు సిబ్బందిలో సానుకూల ఆలోచనలతో పాటు ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంచిందని అధికారులు తెలిపారు.

## భైరవకోనను సందర్శించుకున్న ఆకుపాటి వెంకటేష్






(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 9)

పర్యాటక పుణ్య క్షేత్రం భైరవకోన శ్రీ భైరవేశ్వర స్వామి సన్నిధిలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ వేద ఆశీర్వాదం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన రాయుడు, గుత్తి మహేష్, బండి కిరణ్, అరియారం ఏడుకొండలు, గోసుల సురేంద్ర, మన్నేపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముప్వల శ్రీహరి 99వ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 9)

పొదిలి పట్టణ ప్రముఖులు స్వర్గీయ ముప్వల శ్రీహరిరావు 99వ జయంతి సందర్భంగా వారి కుమారుల ఆర్థిక సహకారంతో అన్నపూర్ణ సేవా సమితి పొదిలి వారి ఆధ్వర్యంలో చిన్న బస్టాండ్ సమీపంలోని గునుపూడి చెంచయ్య సత్రం నందు నిరుపేదలకు వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. మొదటగా స్థానిక ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలోని శ్రీహరి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఉదయం 11 గంటలకు నిరుపేదలకు వస్త్ర దానం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్వల శ్రీహరి కుమారులు రాష్ట్ర గ్రీనరి, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ ముప్వల సుబ్బయ్య, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు, పేర్ల వెంకట శ్రీనివాసరావు, సామి పద్మావతి, యక్కలి శేషగిరి, గునుపూడి మధు సూదన్, కల్లం వెంకట సుబ్బారెడ్డి, కాకునూరి యలమందరెడ్డి, మాగులూరి రామయ్య, సామి రాజా, శ్రీహరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన వస్త్ర దానం కార్యక్రమంలో భారీగా పేదలు పాల్గొన్నారు.

## చీమకుర్తి హరిహర క్షేత్రంలో అంగరంగ వైభవంగా

# శ్రీ అయ్యప్పస్వామి కలశ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం

















ఆదివారం ఉదయం శ్రీ అయ్యప్పస్వామి వారికి మహా గణపతి పూజ, గంగ పూజ, మండపారాధన మహన్యాసక పఠనం, ఆదిత్యాధి నవగ్రహ పూజ అనంతరం అయ్యప్పస్వామి వారికి సుగంధ, పంచామృత, క్షీర, పరిమళ, పుష్ప, పండ్ల రసాలతో అభిషేకాలు, అష్టోత్తర పూజలు, పుష్పాలతో అలంకరణ, స్వామి వారికి నివేదన, మంగళహారతులు, మంత్ర పుష్పం వేద పండితులు నెలబొట్ల రామకృష్ణ శాస్త్రి, సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పాండురంగారావు కుటుంబ సభ్యులు, సర్వ దీక్ష స్వాములతో కలసి అయ్యప్పస్వామి వారికి అభిషేకాలు నిర్వహించి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు అయ్యప్పస్వామి వారిని ప్రదక్షిణ పూర్వకంగా ఛత్ర చామరాలతో, మంగళ వాయిద్యాల వేద మంత్రాలతో శ్రీ అయ్యప్పస్వామి వారిని వూరేగింపు నిర్వహించి శ్రీ అయ్యప్పస్వామి అంతరాలయానికి చేర్చి విశేష పూజలు నిర్వహించి మహా హారతులు సమర్పించారు. శ్రీ హరిహర క్షేత్రంలో అయ్యప్పస్వామి కలశ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా సకల దీక్షా స్వాముల అయ్యప్ప శరణు ఘోషలు హరిహర క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నేలకొంది, శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం లాంఛనంగా ప్రారంభించి సర్వ దీక్ష స్వాములకు స్వహస్తాలతో అన్న ప్రసాదాలు వడ్డించారు. నేటి నుండి ప్రతి రోజు సర్వ దీక్షా స్వాములకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు శిద్దా రాఘవరావు, శిద్దా పాండురంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, శిద్దా నాగేశ్వరావు, శిద్దా హనుమంతరావు, శిద్దా పెద్ద బాబు, శిద్దా సాయి బాబు, శిద్దా వెంకట ప్రసాద్, శిద్దా శ్రీనివాసరావు, శిద్దా సురేష్, శిద్దా కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, చీమకుర్తి పరిసర ప్రాంతాలను చెందిన సర్వ దీక్షా స్వాములు, వాసవి మహిళలు, చీమకుర్తికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## 20 కుటుంబాలకు నిత్యవసరాలు అందజేత

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, నవంబర్ 9)

మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు అద్దంకి నియోజకవర్గం మణికేశ్వరం గ్రామంలోని 20 కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులను 50కేజీలు, కందిపప్పు కేజీ, పంచదార కేజీ, నూనె కేజీ, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ వృత్తిపై ఆధారపడి జీవనోపాధి నడుపుకునే కుటుంబాలు తుఫాను వల్ల నష్టపోయిన వారికి ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలను పునరుద్ధరించడానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్,మాధ్యూస్, ఆదినారాయణ,ప్రసాద్,బలరామిరెడ్డి, ఆశీర్వాదం, ఫ్రాన్సిస్, పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.



## కందుకూరు అతిత్వరలో ప్రకాశం జిల్లాలోకి అందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు

ఆ ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరాయన్నారు. అయితే ఆ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వటంలో రెవెన్యూ శాఖ అభ్యంతరం చెబుతోందని, ఆ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. అటవీ శాఖకు వేరే చోట భూమిని కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. నిరంతర అభివృద్ధిలో భాగంగా కందుకూరు పట్టణంలో త్వరలో 8 కోట్ల రూపాయలతో కొత్త పనులు మొదలు పెట్టబోతున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీలోని 3 కోట్లు, నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నుంచి మరో 5 కోట్లు రూపాయల నిధులు రాబోతున్నాయని చెప్పారు. అలాగే అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణంలోని శివారు ప్రాంతాలకు కూడా మంచినీటి సరఫరా కొరకు 30 కోట్ల రూపాయల నిధులతో టెండర్లు పిలిచారని ఎమ్మెల్యే తెలిపారు. రాళ్లపాడు రిజర్వాయర్ కింద వరి సాగు కోసం ఈరోజు కుడి ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే నాదెళ్ల వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన కార్మికుడు

(షణ్ముఖ వెలుగు, కంభం, నవంబర్ 9)

కంభం పట్టణంలోని నాగులవరం వెళ్లే రోడ్డులోని పెద్ద కాలువ దగ్గర నివాసం ఉంటున్న భవననిర్మాణ కార్మికుడు మండ్ల రత్తయ్య (63)ఆదివారం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తూ ఇంటి దగ్గరలో రోడ్డు పైన ప్రమాదవసాత్తు అనుకోకుండా వెనక్కి పడడంతో తలకి దెబ్బతగలడంతో ఒక్కసారిగా సంఘటనా స్థలంలోనే కుప్ప కూలిపోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా వైద్యులు పరిశీలించి మండ్ల రత్తయ్య చనిపోయినట్లు నిర్ధారించారు. ఒక్కసారి మరణ వార్త విన్న రత్తయ్య కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# చార్జి మెమో కాదు..సస్పెండ్ చేయండి



## మాదిగల పై దాష్టికం ప్రదర్శించిన తాళ్లూరు ఎస్ఐ పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

## జిల్లా ఎస్పీని డిమాండ్ చేసిన దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)**

మాదిగలపై దౌర్జన్యం చేసి, కులం పేరుతో దూషించి అవమానించిన తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జున పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో విలేకరులతో మాట్లాడుతూ తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జున పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు పెట్టకుండా చార్జి మెమోతో సరిపెట్టటం సరి కాదన్నారు. ఎస్ఐ ప్రవర్తించిన దుర్మార్గమైన తీరుకు తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. తాళ్లూరు గ్రామానికి చెందిన అనపర్తి సత్య వర్ధన్ రావు, అతని కుమారుడు విజయ్ మైక్ సెట్, లైటింగ్, డిజె సౌండ్ సిస్టం షాపు నడుపుతున్నారన్నారు. శివరాంపురం గ్రామానికి చెందిన తేళ్ళ లక్ష్మణరావు ఇంట్లో వివాహానికి డీజే బాక్స్ పెట్టారన్నారు. వివాహ సందర్భంగా నవంబర్ ఒకటవ తేదీన ఎస్సీలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారన్నారు. నవంబర్ 2న డీజే సిస్టం దగ్గర ఉండే ఆపరేటర్ రాజేష్ ను ఎస్ఐ మల్లికార్జున స్టేషన్కు పిలిపించి, కులం పేరుతో కొడకల్లారా, మీకు మరేం పని లేదు రా, దున్న మాంసం తిని ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారని అవమానించారు. అదే రోజు డీజే నిర్వాహకుడైన విజయ్‌ను స్టేషన్‌కి పిలిపించి, అతని తండ్రి సత్యవర్ధన్‌రావు ముందే అమ్మ నా బూతులు తిట్టి కొట్టారన్నారు. ప్రశ్నించిన తండ్రి సత్య వర్ధన్ రావు వయసుకు మర్యాద కూడా, ఆయన్ను కూడా కులం పేరుతో తిట్టి అవమానించారన్నారు. ఈ విషయం తెలిసి పోలీస్ స్టేషన్ కి వెళ్ళిన ఎమ్మార్పీఎస్ నాయకులు అనపర్తి ఆదాం, సుబ్బారావులను సైతం దున్న మాంసం తిని బలిసిందిరా మాదిగ నా కొడకల్లారా అని వీరంగం సృష్టించాడన్నారు. పెద్ద మనుషులుగా వెళ్ళిన వారిని కూడా కులం పేరుతో తిట్టి, అవమానించి తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేస్తామని బెదిరించిన తాళ్ళూరు ఎస్సై మల్లికార్జున రావు పోలీసు వ్యవస్థలో ఉన్మాదిగా మారాడన్నారు. జరిగిన ఘటనపై బాధితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేస్తే, ఎస్పీ హర్షవర్ధన్ రాజు కేవలం చార్జ్ మెమోతో సరిపెట్టారన్నారు. బిఎన్ఎస్ చట్టం పోలీసులకు వర్తించదా? ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పోలీసులకు వర్తించదా? అని నాగేంద్ర సూటిగా ప్రశ్నించారు. రేణంగివరం ఎస్ఐ జగన్మోహన్రావు పై లోగడ మాదిగలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో కోర్టు ఎస్సైతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్ళకు శిక్ష విధించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ 2018 (27/2018) ప్రకారం ఎస్సీ, ఎస్టీలు ఫిర్యాదు ఇచ్చినప్పుడు, ప్రాథమిక విచారణతో సంబంధం లేకుండా కేసు నమోదు చేయాలన్నారు. ఎస్ఐ మల్లికార్జున మాదిగల పట్ల దౌర్జన్యం చేశారని ప్రాథమిక సాక్షాలు ఉన్నప్పటికీ, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయలేదన్నారు. ప్రతిపక్షాల నాయకులను, కుల సంఘాల నాయకులను అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసు కేసులు పెట్టి పోలీసులు అరెస్టులు చేస్తున్నారన్నారు.

మాదిగల్ని కులం పేరుతో తిట్టి, తప్పుడు కేసు పెట్టీ జైల్లో వేస్తానని బెదిరించిన ఎస్ఐ మల్లికార్జున పై ఎందుకు కేసు నమోదు చెయ్యరన్నారు. ప్రజల రక్షణకు ఏర్పడిన పోలీసు స్టేషన్లో రక్షకుడిగా వ్యవహరించాల్సిన ఎస్ఐ మల్లికార్జున చట్టాలను పాటించకుండా, తానే రాజు, తానే మంత్రిగా వ్యవహరించాడన్నారు. ఎస్ఐ మల్లికార్జున అగ్రకుల ఖాకీ కండ కావరంతో వ్యవహరించిన అమానుష ఘటనపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు కు బాధితులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. అమలులో ఉన్న బీఎన్ఎస్ మరియు ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చెయ్యమని ఆదేశించకుండా, చార్జి మెమోతో సరిపెట్టడం సరి కాదన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పట్ల, ఎస్సీ, ఎస్టీ బాధితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఎస్ఐ మల్లికార్జునరావును వెంటనే వీఆర్‌కు పంపించి, కనిగిరి డీఎస్పీతో విచారణ జరిపించి కేసు నమోదు చెయ్యాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

# ఘనంగా న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం

## అందరికి న్యాయం న్యాయ సేవాధికార సంస్థ ధ్యేయం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 9)**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కనిగిరి పట్టణంలోని ఎ పి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ బాలికల వసతి గృహంలో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి రూపశ్రీ నేతృత్వంలో మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది అబ్దుల్ గఫార్ షేక్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయసేవలు అందించేందుకు న్యాయసేవాధికార సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బాదితులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తోందన్నారు. న్యాయవాదులను పెట్టుకొనే స్తోమత లేని పేదలకు న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తోందన్నారు. రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు, మహిళలు, పిల్లలు, పరిశ్రమల్లో కార్మికులకు ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. న్యాయవాది పాశం పిచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే న్యాయ సేవలు, చట్టాలపై అవగాహన కలిగివుండాలని తెలియజేస్తూ చట్టాలపై అవగాహన కలిగించారు. చాలా మందికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో అప్పు చేసి న్యాయవాదిని ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఉచిత న్యాయ సాయం గురించి అవగాహన లేకపోవడం, తెలియక పోవడం వల్లే ఆర్థిక భారం పడుతుందని, క్రిమినల్, సివిల్ కేసుల్లో కూడా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయవాది ఫీజు చెల్లించి ఉచిత న్యాయ సాయం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పందిటి మోహన్, పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, స్టడీ టీచర్ వైజయంతి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 104 ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ అనుబంధం సర్వసభ్య సమావేశం




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 9)**

104 ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధం సర్వసభ్య సమావేశం ఆదివారం పొదిలి ఎన్జీవో హెూంలో 104 గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తు ప్రజా సంజీవనిగా పేరు తెచుకున్న 104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది మాత్రం సమస్యలు వలలో చిక్కుకొనివున్నారు. చాలి చాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారు. అరబిందో నుండి రావాల్సిన బకాయిలు అనగా గ్రాట్యువిటీ ఎర్న్ లీవ్ లు డబ్బులు విషయంలో అన్యాయం జరిగింది. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందొ నుండి రావాల్సిన బకాయిలు ఇప్పించాలి. అదే విధంగా ప్రస్తుత యాజమాన్యం అయిన భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగుల సంక్షేమం ఏ మాత్రం పట్టించుకోకుండా ఉద్యోగుల మీద తీవ్రమైన ఒత్తిడి పెట్టి పనిచేయిస్తూ నిబంధనలను ఏ మాత్రం పాటించటం లేదు. ఇప్పటి వరకు నియామక పత్రాలు కానీ పే స్లిప్స్ కూడా ఇప్పటి వరకు ఉద్యోగులకు అందజేయలేదు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ అధికారులు యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో ఉద్యోగ నియమకాలు చేపట్టి బఫర్ సిబ్బంది ని ఆర్.ఎఫ్. పి నిబంధనలు ప్రకారం నియమించి ఉద్యోగుల మీద అదనపు భారం తగ్గించాలి. 104లో ఫార్మాసిస్ట్ ని నియమించాలి అప్పటివరకు డిఈఓలకు డ్రగ్స్ నిర్వహణ బాధ్యతలు తప్పించాలి. 2020 తరువాత జాయిన్ అయినా వారికి ఎవరికి జీతాల పెంపు లేనందున గత ఐదున్నర సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాము, కావున మాకు అందరికీ ప్రస్తుత అవుట్ సోర్సింగ్ జీఓ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలి. సంవత్సరాలనుండి సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్ లకు స్లాబ్ అమలు చెయ్యాలి. డిఈఓలకు ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జీఓ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలి. ఉద్యోగులకు గతం లో లాగా క్యాజువల్ లీవ్‌లు అమలు చెయ్యాలి. పియఫ్ఇయస్ఐలో విధించిన కోతలు సరిచేసి యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించాలి. ఈఎస్ఐ పూర్తి స్థాయిలో అమలు చేసి అమలు నోచుకోని ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇప్పించాలి. డిఈఓ ఇతర పనులు డిఈఓలకు అప్పగించకూడదు. వాటర్ క్లోరిన్, డ్రగ్ రికార్డులు నిర్వహణ లాంటి పనులు అప్పగించకూడదు. వెహికిల్‌కి ఇన్సూరెన్స్, ఫిటినెస్‌లు వెంటనే చేయించాలి. ఈ సమావేశంలో 104 అధ్యక్షులు శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, వర్మ, ఉద్యోగులు పాల్గొని భవిష్యత్తులో రాష్ట్ర కమిటీ తీసుకునే నిర్ణయాలకు సంఘీభావం తెలుపుతామని నిర్ణయించారు.

# భగవత్ బంధువులు అందరికి ఆహ్వానం

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 9)**

తర్లుపాడు మండల కేంద్రములో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి తెప్ప తిరునాళ్ల (తెప్పోత్సవము) 15వ తేదీ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించబడును. తెప్పోత్సవ అనంతరం భక్తులకు అల్పాహారం వితరణ జరుగుతుందన్నారు. అనంతరం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాల తరువాత తర్లుపాడు గ్రామ చెరువులో శ్రీ స్వామి అమ్మవార్లు తెప్ప పైన శేష పానుపు అలంకరణలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇంతటి బృహత్తరమైన దైవ కార్యక్రమం జరగడం మన అదృష్టమని, కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 9)**

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు నిరసనగా ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా మార్కాపురం పట్టణంలోని 31వ బ్లాక్, రాజ్యలక్ష్మి కాలనీ నందు ఆదివారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు షేక్ సలీం, వార్డు ఇంచార్జ దొండపాటి ఏడు కొండలు యాదవ్,వార్డు అధ్యక్షుడు షైక్ కరీముల్లా, గోలమారి శ్రీనివాసరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ బాలా మురళి కృష్ణ, సత్యంరెడ్డి, షేక్ గౌస్‌మొహిద్దీన్, పిల్ప్ యాదవ్, 9 బ్లాక్ సిరాజ్, పత్తి రవిచంద్ర, ముక్తారెడ్డి, ఆసిఫ్ ఖాన్ , కొత్త కృష్ణ, సుబ్బారెడ్డి, 17 బ్లాక్ ఇంచార్జ్ కరీముల్లా, 8 వా బ్లాక్ ఇంచార్జి గోలమారి శ్రీనివాసరెడ్డి,ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు, భారీ ఎత్తున పాల్గొన్నారు. కోటి సంతకాల కార్యక్రమంలో ప్రజాలు పాల్గొని ఈ ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు.

# మొంథా తుఫాన్ నష్టం అంచనాకు కేంద్ర బృందం పర్యటన

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)**

నలుగురు సభ్యుల కేంద్ర మినిస్ట్రీయల్ బృందం సోమవారం మధ్యాహ్నం నుండి ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామం, నాగులుప్పలపాడు మండలం ఓమ్మివరం, నాగులుప్పలపాడు గ్రామాలలో పర్యటించి మొంథా తుఫాన్ నష్టాన్ని అంచనా వేస్తారు. ముందుగా మొంథా తుఫాన్ నష్టం గురించి కలెక్టర్ ఆఫీస్ ప్రజా ఫిర్యాదుల విభాగం పీజీఆర్ఎస్ హాల్ నందు ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శనను తిలకిస్తారు. తరువాత చీరాల పర్యటనకు బయలుదేరి వెళ్తారు.

# కడుపునొప్పి భరించలేక కార్మికుడు ఆత్మహత్య



**(షణ్ముఖ వెలుగు, కంభం, నవంబర్ 9)**

కందులాపురం రోడ్డు పూసల బజారులో నివాసం ఉంటున్న భవననిర్మాణ కార్మికుడు శీలం రాజా(33) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శీలం రాజా రాడ్ బైండింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ మధ్య మృతుడు శీలంరాజా కడుపునిప్పితో బాధపడేవాడని



ఆదివారం మధ్యాహ్నం భార్య బయటకు వెళ్లగా కడుపునొప్పి ఎక్కువ అయినందున భరించలేక ఇంట్లో ఉన్న ఏదో గడ్డిమందు తాగి పడిఉండగా ఇంటికి తిరిగి వచ్చిన భార్య చూసి ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని బంధువుల సహాయంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో వెంటనే కంభం ప్రభుత్వ ఆసుపత్రి తరలించాగా వైద్యపరీక్షలు చేసిన వైద్యులు శీలం రాజా చనిపోయినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఒక కూతురు ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మల్లవరంలో బ్రాహ్మణ వన సమారాధన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)

మల్లవరంలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ వన సమారాధనలో మన సమారాధన మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మల్లవరం వెంకటేశ్వర అన్నదాన సమాజం, బ్రాహ్మణ సత్రం ఆధ్వర్యంలో వందల మంది బ్రాహ్మణులు పాల్గొన్నారు. అలాగే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నీలం రాజు వెంకట సుబ్బ శాంతారావు, సెక్రటరీగా రాచపూడి శ్రీకృష్ణ , ట్రెజరర్ గాలి సత్య రామ కోటేశ్వరరావు ఎన్నిక కాబడ్డారు. చైర్మన్ గాలి నరసింహుర్తి, ఉపాధ్యక్షులుగా నీలం రాజు రాధాకృష్ణమూర్తి ఎన్నుకున్నారు. బ్రాహ్మణ బంధువులందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూలూరి వసుందర వీణానాదం కార్యక్రమం జరిగింది. ఇటీవల శ్రీకాళహస్తీశ్వర స్వామి ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా ఎన్నిక కాబడిన కామరాజుగడ్డ కుసుమ కుమారిని సత్కరించారు.

# హౌసింగ్ బోర్డ్ కాలనీలో డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)

రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ జనరల్ సెక్రటరీ ముల్లంగి రవీంద్రారెడ్డి , జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు నన్నే బోయిన రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఒంగోలు నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న బొమ్మరిల్లు నందు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 52వ జన్మదిన శుభ సందర్భంగా కేక్ కటింగ్, పిల్లలకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరి రవి బాబు, ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్, రాష్ట్ర పార్లమెంట్ పరిశీలకులు వై వెంకటేశ్వర రావు, బొట్ల రామారావు, కె వి రమణారెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు నకరికంటి శ్రీనివాస్, పల్నాటి రవీంద్రరెడ్డి, భూమిరెడ్డి రవణమ్మ, పేరం ప్రసన్న, గొల్ల నాగమణి, పాలడుగు రాజీవ్, దేవా, తాత నర్సింహాగౌడ్, నాటారు జనార్దన్, పిగిలి శ్రీనివాస్‌రావు, షేక్ మీరావలి, వేముల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం**
**దేవుడి దయతో వర్షాలు బాగా కురిశాయి**
**సోమశిల నీళ్లతో రాళ్లపాడుకు మహర్దశ**
**ఏడాదికి రెండు పంటలు పండించేలా రైతులు కృషి చేయాలి**
**రైతుల హర్షధ్వానాల మధ్య నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే**

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 9)

రాళ్లపాడు రైతుల కళ్ళల్లో ఆనందం చూడడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లపాడు రిజర్వాయర్ నిండిన నేపథ్యంలో, ఆదివారం పంట కాలువలకు నీటిని విడుదల చేశారు. ముందుగా రిజర్వాయర్ వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఏడాది పంటలు బాగా పండి, రైతుల ఇళ్లల్లో ధాన్యపు సిరులు పొందాలని మొక్కుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వర్షాలు బాగా కురవడంతో, కుంటలు చెరువులన్నీ నీళ్లతో కళకళలాడుతున్నాయని అన్నారు. రాళ్లపాడు రిజర్వాయర్ లో ప్రస్తుతం 20 అడుగులు నీరు ఉందని, వరిసాగు కోసం నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. అధికారుల సూచనలు పాటిస్తూ, వరిలో మంచి దిగుబడి సాధించి, ప్రతి రైతు ఇల్లు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వంలో పంట కాలువ మరమ్మత్తులు, రాళ్లపాడు గేట్లు నిర్వహణ, ఇతర పనుల కోసం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేశామని అన్నారు. ప్రస్తుతం ఉన్న పాత గేట్లు ఏదైనా మరమ్మతులు గురైనచో వాటికి అనుసంధానంగా స్టాప్ లాక్ గేట్లు కొరకు 4.8 కోట్ల రూపాయలతో అంచనాలు తయారు చేసి పై అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. సోమశిల నుంచి రాళ్లపాడు కు నీరు తీసుకువచ్చే గొట్టిపాటి కొండప నాయుడు కాలువ పనులు 100 శాతం పూర్తయ్యాయని ఎమ్మెల్యే నాగేశ్వరావు తెలియజేశారు. సోమశిలలో నీటిని వదిలితే నాలుగు రోజుల్లోనే ఇక్కడకు నీళ్లు వస్తాయన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం ఉన్న నీళ్ళు వరి నాట్లకు సరిపోతాయని, ఆ తర్వాత సోమశిల నుంచి విడుదలయ్యే నీటితో వరి సాగు పూర్తవుతుందని చెప్పారు. కాలువ పనుల పూర్తికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ఎంతో సహకరించారని పేర్కొన్నారు. సోమశిల నుంచి వాటా ప్రకారం 1.5 టీఎంసీల నీరు నిరంతరంగా వస్తుందని , రాళ్లపాడు లో నీరు పుష్కలంగా అందుబాటులో ఉంటుంది కాబట్టి నియోజకవర్గంలో తాగు, సాగునీటికి ఇక ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. రైతులు కూడా రెండో పంట సాగుకు ఆలోచన చేయాలని ఎమ్మెల్యే గారు సూచించారు. రాబోయే రోజుల్లో మొక్కజొన్నకు డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, రాళ్లపాడు కింద రెండో పంటగా మొక్కజొన్నను వేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, ఉమ్మనేని సుబ్బారావు, నరాల మాలకొండరెడ్డి, పారా బుచ్చయ్య, అత్తంటి వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జినిగిర్ల నాగరాజు, సోంపల్లి మనోహర్, గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, కిలారి కొండయ్య బొల్లినేని రమణయ్య, రాళ్లపాడు ప్రాజెక్టు డి.ఈ వెంకటేశ్వర్లు, శేషయ్య, రైతు సంఘం నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# పోతినేని వారి ఫ్యామిలీస్ ఆత్మీయ కలయిక





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)

పోతినేని వారి ఫ్యామిలీస్ ఆత్మీయ కలయిక హైదరాబాదులోని హొటల్ తబలా కెపిహెచ్‌బిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతినేని ఫ్యామిలీస్ నలుమూల నుండి వచ్చి గెట్ టుగెదర్ కార్యక్రమంలో పాల్గొని ఒకరికి ఒకరు పరిచయం చేసుకొని సంతోషంగా గడిపారు, ఈ కార్యక్రమానికి ఒంగోలు నుండి పోతినేని శ్రీనివాసరావు తన ఫ్యామిలీతో కార్యక్రమంలో పాల్గొన్నారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కార్తీకమాసంలో పోతినేని కుటుంబాలు అందరూ ఒక చోట కలుసుకోవటం చాలా సంతోషంగా ఉందని, పోతినేని వారి పేరుతో ఒక మంచి హాస్పటల్ ఉంటే బాగుంటుందని తర్వాత తరాలకు ఆదర్శంగా ఉంటుందని అన్నారు, పోతినేని ఫ్యామిలీ అంటే మరొకరికి ఆదర్శంగా ఉండాలని, ఐక్యతగా ఉండాలని తెలిపారు, ఆత్మీయ కలయిక కార్యక్రమం సక్సెస్ కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మురళి, కృష్ణ, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, పియస్‌ఆర్, ఇంకా నలుమూలల నుండి వచ్చిన పోతినేని కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి.





# పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

## 48 మంది లబ్ధిదారులకు రూ.37.21 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 9)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా తీసుకెళ్తూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందిస్తున్నారు అని తెలిపారు. ఇప్పటివరకు కందుకూరు నియోజకవర్గంలో 777 మంది లబ్ధిదారులకు రూ.6.30 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పేదల ఆరోగ్య రక్షణకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కందుకూరు ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ మా వంటి పేద కుటుంబాలకు పెద్ద ఆపదలో చేయూతనిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

**చెక్కులు అందుకున్న లబ్ధిదారులు...**

వలేటివారిపాలెం మండలంలో 13 మంది లబ్ధిదారులకు రూ.6.75 లక్షలు, లింగసముద్రం మండలంలో 15 మంది లబ్ధిదారులకు రూ.8.08 లక్షలు, గుడ్లూరు మండలంలో 8 మంది లబ్ధిదారులకు రూ.3.66 లక్షలు, ఉలవపాడు మండలం 12 మంది లబ్ధిదారులకు రూ.18.72 లక్షలు వెరసి 48 మంది లబ్ధిదారులకు రూ.37.21 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, నాదెళ్ల వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ జ్వరాలు, విద్యుత్ కోతలు ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పాలకులు వెంటనే స్పందించాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ నేత నేతి మహేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 9)**

ఒకవైపు వానల వల్ల బురద, దాంతో పెరిగిన దోమల బెడద, మరోవైపు విద్యుత్ శాఖ ప్రకటించిన అధికారిక పవర్ కట్స్ వల్ల ప్రజలు రాత్రింబగళ్లు దోమల చేత అల్లాడుతున్నారు. కందుకూరులో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి విద్యుత్ పోయి ఇప్పటికీ రాకపోవడంతో పాటు విద్యుత్ అధికారులు స్పందించడం లేదు అని చాలామంది మిత్రులు నాకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి అంటే స్థానిక పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నాయో స్పష్టంగా చూపిస్తుంది. డెంగ్యూ జ్వరాలతో ఇప్పటికే ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. భవిష్యత్తు ఉన్న యువకుడి మరణం కందుకూరు ప్రజలను తీవ్రంగా కలచివేసింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ లేకపోవడం, దోమల మందు కొట్టకపోవడం ప్రజలను మరింత భయాందోళనకు గురిచేస్తోంది. ప్రజలు కనీసం దోమల మందు కొట్టించాలన్న డిమాండ్ కూడా నిధుల లేమి కారణంగా నెరవేరకపోవడం చాలా బాధాకరం. డెంగ్యూ వస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సదుపాయాలు లేక పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తోంది. కందుకూరు పట్టణం, పంచాయతీలలో తక్షణమే దోమల మందు పిచికారీ చేయాలి. కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తగిన నిధులు కేటాయించి వైద్య సదుపాయాలను మెరుగుపరచాలి. విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగించే చర్యలు తీసుకోవాలి. డెంగ్యూ కారణంగా ప్రజలు చనిపోవడం అంటే వైద్యరంగంలో ప్రభుత్వం వైఫల్యం స్పష్టమవుతోంది. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలను కాపాడటానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# విద్యార్థులకు భారతీయతను నేర్పుతున్న బాలవిహార్ శిక్షణ తరగతులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 9)**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్తంగా శ్రీగిరి గో క్షేత్ర భవనంలో గత మూడు నెలలుగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న బాల విహార్ శిక్షణ తరగతులు విద్యార్థులకు భారతీయత గురించి నేర్పించడంతో పాటు భావి సాహిత్యవేత్తలుగా సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దుతున్నాయి. మాతృ భాష తెలుగులో చక్కగా మాట్లాడుతూ కథలను చెబుతూ అంత్యాక్షరి పోటీలో ఉత్సాహంతో పాల్గొంటూ భగవద్గీత శ్లోకాలను అప్పగిస్తూ, బొమ్మల రామాయణం పుస్తకంలోని బొమ్మలకు రంగులు అద్దుతూ మేటి చిత్ర కారులను తలపిస్తూ రేపటి తరం ఆశాజ్యోతులమని వారు నిరూపిస్తున్నారు. విద్యార్థులలో నిబిడీకృతమై ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీసే విధంగా శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వాహకులు చిన్మయ మిషన్ ప్రతినిధులు చేస్తున్న కృషిని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు. ఆదివారం శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవనంలో జరిగిన శిక్షణ తరగతులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పర్యవేక్షించారు.





# పలువురు బిజెపిలో చేరిక



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, నవంబర్ 9)**

బద్వేల్ పట్టణంలోని 13వ వార్డుకు సంబంధించిన షేక్ దావూద్ మరియు 33 వ వార్డుకు చెందిన యారవ సురేష్ బాబులు బిజెపిలో చేరారు. వీరు పట్టణానికి చెందిన భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి పవన్ కుమార్, భారతీయ జనతా పార్టీ బుద్వేల్ పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య రాయల్‌ల ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. బిజెపి చేపడుతున్న పలు ప్రజా కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. మోదీ మానియా ప్రపంచ దేశాలకు విస్తరిస్తుండడం ఎంతో సంతోషకరమని నేడు ప్రపంచంలో భారత్ కు ఒక ప్రత్యేక స్థానం ఏర్పడిందంటే అది మోడీతోనే సాధ్యమైంది అన్నారు. రానున్న రోజులను బిజెపి పార్టీ రాష్ట్రంలోనూ తన సత్తా తప్పక చాటుతుందని, అలాగే పట్టణంలో పార్టీ బలపడేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. బీజేవైఎం కడప జిల్లా సెక్రెటరీ సురేంద్ర సీనియర్ నాయకులు కొలిశెట్టి రమణయ్య, సతీష్ కుమార్‌రెడ్డి సూచనల మేరకు భారతీయ జనతాపార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, భారతీయ జనతా యువమోర్చా కడప జిల్లా జనరల్ సెక్రెటరీ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు

## పర్యవేక్షించిన మంత్రి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు







**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 9)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 11వ తేదీన పీసీ పల్లి మండలం లింగన్నపాలెం గ్రామంలో మధ్య, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమల (ఎం.ఎస్.ఎం.ఈ) పార్కు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేయుచున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ పి రాజబాబు, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, జిల్లా అధికారులు ఆదివారం పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నిమిత్తం నియమించిన ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు తెలియచేశారు. హెలిప్యాడ్ ప్రదేశం, సభ వేదిక, పార్కింగ్ ప్రాంతాలను, సీఎం కాన్వాయ్ రూట్, చుట్టు ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ జరుగుతున్న అన్ని ఏర్పాట్లను సమీక్షించారు. ఇంకా తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ వీఐపీల వాహనాల రాక, సభా స్థలంలో డయాస్, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలను, హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఉన్న రూట్‌ను, క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. సీఎం పర్యటన సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, ఇతర శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్ఎస్‌జీ అడిషనల్ ఎస్పీ యస్ వి రమణ, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, పిసీఆర్ సిఐ దుర్గ ప్రసాద్, యం శ్రీనివాసరావు, కనిగిరి సిఐ ఖాజావలి, పామూరు సిఐ యం శ్రీనివాసరావు, అర్ఐ రమణరెడ్డి, ఎస్ఐలు, తదితరులు ఉన్నారు.







## కరేడు రైతు కిష్టారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు






**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 9)**

ఇటీవల అకాల మరణానికి గురైన, కరేడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుకులు, వార్డు మెంబర్ కృష్ణారెడ్డి తండ్రి రైతు కోటిరెడ్డి కుటుంబ సభ్యులను, ఇటీవల కందుకూరులో జరిగిన ఆటో యాక్సిడెంట్‌లో గాయపడిన మిరియం రవిని ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైయస్సార్ టిఏ అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టారావు, రమణయ్య, రామకృష్ణ, కోటేశ్వరావు, మాల్యాద్రి, శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలో బీసీలకు ఉన్నత స్థాయి పదవులు

### కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన నక్క శ్రీను యాదవ్





**(షణ్ముఖ వెలుగు,పెద్దారవీడు,నవంబర్9):**

కుటమి ప్రభుత్వం సారథంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పడిన అనంతరం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్లు నియమించారు. అనంతరం ఆదివారం రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్లు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సారాధ్యంలో ఆదివారం రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్, డైరెక్టర్ గా ఎర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలం తంగిరాల పల్లి గ్రామ టిడిపి నాయకులు ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు నక్క శ్రీను యాదవ్ రాష్ట్ర డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ నూక సాని బాలాజీ, మండల పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మ గంగరాజు యాదవ్, టిడిపి నాయకులు ఎల్లయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 9)**

విపిఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమం మూడోవ రోజు శనివారం రాత్రి నెల్లూరు విఆర్‌సీ



మైదానంలో ఘనంగా నిర్వహించారు. విపిఆర్ దంపతులు ఆహ్వానం మేరకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, జిల్లాలోని పలువురు ముఖ్య నాయకులు లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతులు రామానంద భారతీ స్వామివారి సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com